# మల్లె మొగ్గ

ఏప్రిల్ నెల సాయంకాలం ఎండలో గడియారం స్తంభం కడిగిన ముత్యంలా మెరుస్తూ వుంది. రోజంతా చెమట వెళ్ళగక్కిన పగలు సాయంత్రం చల్లని కృష్ణ గాలి తింటూ వుంది. ఖాలీపోయే పొద్దుబొట్టులో ఆకాశం కొత్త పెళ్ళికూతురులా సిగ్గుపడుతూ బుగ్గల్లో కెంపులు నింపుకొంది.

పొద్దు వాలుతున్నప్పుడు రోడ్డు పరుగు పందెంలో ఆటగాడులా రొప్పుతూ వుంది. గడియారం స్తంభం నిమ్మకు నీరెత్తినట్లుగా చిద్విలాసంగా నాలుగు ప్రక్కలా చూస్తూ నవ్వుతూ వుంది. దాని ముళ్ళు ఎండలో ఎంత తొందరగా నడిచాయో ఇప్పుడూ ఇంతే. ఎప్పుడూ ఇంతే. యుగయుగాల నుంచి ఈముళ్ళు ఇలాగే తిరుగుతున్నాయి. తొందర లేదు. ఆలస్యంలేదు. చెడా లేదు. బాగు పడా లేదు.

పట్టణం నడిబొడ్డులో చుట్టూ కావలసిన వన్నీ అమ్ముడు పోతున్న చోట, అన్నీ డబ్బుకు అందుబాటులో ఉన్న చోట నిస్సహాయంగా ఉన్న గడియారం స్తంభం తలనీడ నేలమీద పడుతున్న చోట గడియారం శిరస్సు నుంచి జారిపడి ఘనీభవించిన కాలపు తునకలాగా కూర్చుంది పూలపిల్ల కుసుమ.

క్షణక్షణానికి తనమీద నుంచి పెరిగి పోతున్న గడియారం స్తంభం నీడను చూస్తూ కూర్చున్న కుసుమ ముందు చెక్కపెట్టి పైన వెదురు తడక కట్టుకొన్న చీరమీద గుమ్మున తల దిమ్మెక్కించే మల్లెల మత్తువాసన కుప్పలాగా వుంది.

కడుతున్న దండ కడుతూ వుండగానే అమ్ముడు పోతూ వుంది. కుసుమ తల ఎత్తకుండానే తడి చేతులతో పూలకు దారం హారంగా వేస్తూంటే అవి ఆనంద బాష్పాలుగా రాలుతున్నాయి. రాలి పడ్డ నీటి బొట్టు నేలంత తడుపుతూ వుంటే రోజంతా ఎండ వేడిమికి వళ్ళు మండిపోయిన చేతులు చెక్కపెట్టె ప్రక్క సేద తీర్చుకొంటున్నాయి.

కుసుమ పూలు తాకుతుంటే దండ కడుతుంటే కవి కందపద్యం అల్లు తున్నట్లుంది. బాల్యం పొరలు పూర్తిగా రాలిపోని చేయి మొగ్గలాగ వుంది. దారమున్న చేయీ పూవూ అన్యోన్యంగా అవినాభావ సంబంధంగా కలగలుపుగా కలసిపోయి సాదా రంగులో తెల్లగా మరకలుగా కనిపిస్తున్నాయి.

పూలు కావలసిన వాళ్ళు పూలు, దండ కావలసిన వాళ్ళు దండ, తీసుకు పోతున్నారు

మగవాళ్ళు, ఆడవాళ్ళు, పసివాళ్ళు, పడచువాళ్ళు, ముసలివాళ్ళు, పనివాళ్ళు ప్యూనులు, దొరలు, దొరసానులు తొందరలో మందలింపుల్లో పూలకు వస్తారు. పుచ్చుకుపోతారు.

సైకిళ్ళు, రిక్షాలు, కార్లు ఏం వచ్చినా కుసుమ దగ్గరకు వచ్చేవి కాళ్ళు. పూలు తీసుకుపోయేవి చేతులు. కుసుమకు మనుషులంటే కాళ్ళు చేతులు అంతే!

సంఘంలో వాళ్ళ స్థానం ఏమిటో, జీవితంలో వాళ్ళ స్థితి ఏమిటో. ఆర్థికంగా వాళ్ళ అంతస్తు ఏమిటో, కుసుమకు తెలియదు. కాని వాళ్ళు ఆనందంగా వస్తారు. ఆనందంగా వెళతారు. వాళ్ళు పూలు తీసుకుపోతున్నప్పుడు పొందే ఆనందం డబ్బును బట్టి కానీ, పూల మొత్తాన్ని బట్టి కానీ ఉండదు. ఒక్క పూవూ ఆనందమే! పూలమాలా ఆనందమే!

ఉరవడి తగ్గి ఊపిరి పీల్చుకొంటున్నప్పుడు కుసుమ కళ్ళ ముందు రెండు కాళ్ళు నిలబడివున్నాయి. తనకు అవి బాగా పరిచయం. ఎన్నిసార్లో చూచింది. ఆ కాళ్ళు బూట్లు లేకుండా రావు. ఆ బూట్లు తనకు బాగా గుర్తు. అప్పుడే పాలిష్ చేసినట్లు అవి మెరుస్తూ వుంటాయి. ఉదయం చేసిన పాలిష్ సాయంకాలం వరకు అలాగే వుంటుంది. ఆ బూట్లకేకాదు, ఆ కాళ్ళకీ దుమ్ము అంటుకోదు. ఆ మనిషికీ మనసుకీ దుమ్ము అంటుకోదు.

ఆబూట్ల సొంతదారు సుందరరావు. తాలూకా ఆఫీసులో రెండేళ్ళ నుంచి గుమస్తా! ఆఫీసు నుంచి పోతూ ఆరు గంటలకు అంగడికి వస్తాడు. పావలా పూలు తీసుకొంటాడు.

సుందరరావు సాధారణంగా కుసుమతో మాట్లాడడు. పర్సు జేబులో పెట్టు కొన్నంత భద్రంగా పావలా తడిక మీద పెడుతాడు. కుసుమ చెండు ఇస్తుంది. పసిపాప చెక్కిళ్ళు తాకినట్లు పూలచెండ అందుకొంటాడు. రోడ్డుమీద మానవ సముద్రంలో మరో బొట్టుగా కలసిపోతాడు.

ఆడవాళ్ళ మాట కాదు, మగవాళ్ళ పూలు బేరం చేస్తుంటే కుసుమకు కోపం వస్తుంది. పేదవాని కోపం ఆ బేరగాళ్ళను, అంగడి చుట్టూ తిరిగే చీమలను చూస్తుంటే చీమల మీద ప్రేమ కలుగుతుంది. బేరం ఆడకపోవటమేకాదు, మాట్లాడక పోవటం, ఆతని ముఖం చూడటానికి ఆమెకు అవకాశం ఇచ్చింది. ఆ ముఖంలో పూల పరిమళం వుంది.

ఆ రోజు కూడా పూల పొట్లం చేతికిస్తూ ముఖంలోకి చూచింది. ఆ రోజు ఆమె గుండెలు జివజివ లాడాయి. గడియారం స్తంభం పక్కకు ఒరిగినట్టయింది. సుందరరావు ఆమె ముఖంలోకి చూశాడు !

వెన్నెల తరంగాలు రాశి పోసినట్లు చెక్కిళ్ళు, చీకటిలో దివిటీలు లాగ కళ్ళు, కాగే పాల మీద మీగడ కదిలినట్టు ముక్కుగోళ్ళు.

మళ్ళీ చూశాడు !

విశాలమైన పాల రాతి పలక మీద నల్లని పాము పిల్లలు ఆడుకొన్నట్లు ముంగురులు.

మలినం లేని నుదురు !

తడి ముంజేతితో ముంగురులు పైకి నెట్టుకొంటే నేతి బొట్టు పడ్డ పింగాణీ పాత్రలాగా నుదురు !

శూన్యంగా నుదురు !

కనిపించని వెంట్రుకలపాదుకూ పాదుకూ మధ్య ఉబ్బెత్తుగా ఉన్న చర్మం - నూనెపడి మెరిసే గాజు పలకలాగా వుండి మెడ చుట్టూ పొటమరిస్తున్న యౌవనపు అల అలతిగా తల వూపుతుంది.

బోసిగా మెడ! ఒత్తుగా నల్లగా వ్యాపించిన జుత్తు, అమావాస్య నల్లదనంతో ఆవులించి జడగా ప్రాకి ప్రాచీన దేవాలయ ప్రాభవం చూపటానికి బాట వేసింది.

కుసుమను, కాళీగా తల, చూస్తున్న సుందరరావు కళ్ళలో మన్మథుడు కాలిన నాటి బూడిద లేచివచ్చి పడితే కళ్ళు నులుంకొన్నాడు.

నీళ్ళు తిరిగాయి.

కుసుమ సుందరరావు కళ్ళలో నీటిచెమ్మ చూడలేక పోతున్నప్పుడు పూల పొట్లం పుచ్చుకొన్న సుందరరావు వెళ్ళిపోయాడు.

ఎప్పుడూ లేంది, ఆ రోజు సుందరరావు అలా చూడటం కుసుమ తట్టుకో లేక పోయింది. వెనక్కు తిరిగైనా చూడకుండా వెళ్ళిపోతున్న అతన్ని చూడ కుండానూ ఉండలేక పోయింది.

కుసుమ పూలు కొంటుంది. కుప్ప పోస్తుంది. అమ్ముతుంది. కానీ తనకు మాత్రం పూలులేవు.

రోడ్డున వచ్చే పోయే ఆడవాళ్ళు తమ తలల్ని పూలతో అలంకరించి గౌరవిస్తే చూసి కళ్ళనీళ్ళు పెట్టుకొంటుంది. మరుక్షణంలో నీళ్ళు తుడుచుకొంటుంది. నవ్వుతుంది. పూలు తనకు లేకపోవటం దుఃఖం, ఇతరుల కుండటం ఆనందం!

తన తలలోకి పూలు తేవలసిన మనిషి రాకుండా పోయాడు. తనను పదేళ్ళ పసిపిల్లగా వున్నప్పుడు పెళ్ళాడిన మనిషి పదేళ్ళనుంచి రాలేదు. రాడని కూడా తెలిసిపోయింది.

కూలీ నాలీతో జీవించే అమ్మానాన్నలకు గారాలకూతురు కుసుమ. సంవత్సరం తేడాతో అమ్మానాన్నా హరీఅంటే దిగులుతో కృంగి పోతున్నప్పుడే మిలటరీలో ఉన్న భర్త యుద్ధంలో చనిపోయాడన్న వార్త, కాలిపోయిన ఇంటి మీద పిడుగు పడినట్లు వినిపించింది.

లోకాన్ని తేరిపార చూడక ముందే లోకంతనని నిషా పెట్టి చూచింది. ఎలా వుంటాడో తెలియని మనిషికోసం, ఆమనిషివి అని తన మెడలోవున్న తాళి, నుదుట వున్న బొట్టు, తలలోవున్న పూలు, చేతులకున్న గాజులు లోకం తీసుకు పోయింది.

పుట్టిందగ్గర్నుంచి పూలంటే ప్రాణమిచ్చే కుసుమ, తన పూలు లోకం తీసుకొన్న దగ్గర్నుంచి లోకానికి పూలు ఇవ్వటం కోసం ఇంకా విచ్చుకోని మొగ్గ లాంటి కుసుమ గడియారం స్తంభం దగ్గర దానినీడలాగా కూర్చుంటూ వుంది.

పూలు అమ్ముకోవటంలో ఒక తృప్తి ఉంది. ఒక ఆనందం ఉంది. ఒక జీవనోపాధి ఉంది. ఎడారిలో ఒయాసిస్సులాగా రోడ్డుమీద అందీ అందని పూల వాసన.

పూలు కడుతూవుంది. జనం వస్తున్నారు. కొంటున్నారు. పోతున్నారు. భగవంతుని సృష్టితన చేతుల మీదగా ఉపయోగం పొందుతూ వుంటే ఆపూలు తనే సృష్టించినట్లు తృప్తి పొందుతూవుంది కుసుమ.

పూలుకొనేవాళ్ళు అనేమాట వినిపిస్తే తనగుండెలు కలుక్కుమంటే అన వచ్చుకానీ, తలనిండా పూలుపెట్టుకొన్న వాళ్ళనుచూస్తే కనురెప్పల కింద చీకటి క్షణకాలం కదిలితే కదలవచ్చు కాని ఆమె సాధారణంగా ఆనందిస్తుంది. మామూలు మనిషిగా సంతోషిస్తుంధి.

పూలు మూట కట్టి తడిక గోడకానించి చెక్కపెట్టె నిలబెట్టి అంగడి వూడ్చి ఇంటికి పోయి, అన్నం వండుకొని, తిని పడుకోబోయేటప్పుడు తనని అమ్మలాగా అప్యాయంగా చూచుకొనే పక్కింటి పెద్దమ్మ సినిమాకు రమ్మంటే పోయింది కుసుమ.

సినిమాకి రావటం మంచిదే అయింది.

మొదటాట చూచి సుందరరావు బైటికి వస్తున్నాడు. ప్రక్కనభార్య, ఎంత అందంగా వుంది. ఆమె ఎంత అదృష్టవంతురాలు. ఆ చేయిసీడ అండ తోడు ఆమెకెంతో బలం.

ఆమె తలలో పూల మాల ఉంది. అది ఆ రోజు సాయంకాలం తను కట్టి ఇచ్చిందే. అది తన దగ్గర్నుంచే వెళ్ళింది.

ఆ మల్లెలు ఎంత సువాసన వెదజల్లు తున్నాయో! ఎంత సువాసన!

ఆ మల్లెలు ఎక్కడ పుడితేనేం, తన ఇంటికి వచ్చాయి. తన చేతులతో మాల కట్టింది. ఆ సువాసన తన చేతుల మీదుగా పోయింది. తాను మాలలో ఉంచిన పెంచిన పోషించిన సువాసన. తన సువాసన, ఆమె తల లోంచి వెలు వడుతూ వుంది.

అతనితోపాటు ఆమె వెళ్ళిపోయింది. అయితే సువాసన ఉంది. సన్నగా, పల్చగా, లీలగా, కోమలంగా, సుగంధంగా వస్తూ వుంది. హాలు చుట్టూ, వీధిచుట్టూ ఊరు చుట్టూ, దేశం చుట్టూ, సువాసన, ఇవాళ్టి సువాసన, నిన్నటిది, మొన్నటిది, ప్రాచీన సువాసన, ఇవాళ సినిమా హాలులోంచి వెలుపలికి వచ్చింది. పోయింది.

కుసుమ గుండె ఆ సువాసన బరువుకు ఉక్కిరి బిక్కిరి అయి ఊగిసలాడి పోయింది. నిలబడలేక పోయింది. సినిమా చూస్తున్నంత సేపూ ఆ గంధం ఈ ముక్కును గిల్లుతూనే ఉంది. సువాసన ఇంకా పుడుతూనే వుంది. ఈ అనుభవం కొత్తది. ఆ సువాసన ఇంటికి వచ్చినా వదిలిపెట్టలేదు.

ఆ సువాసన ఆ రోజు నుంచి ఆమె అంతస్స్వాన్నయువుల్లో ఏదో మూల ఒక గది అద్దెకు తీసుకొంది. బైటికిరాదు. వదలిపెట్టిపోదు. వళ్ళంతా లారీ పోతుంటే ఊగే బ్రిడ్జిలాగా వూపుతూ ఉంటుంది.

మరునాడు సుందరరావు పూలు కొనటానికి వచ్చాడు. పావలా ఇచ్చాడు. పూల పొట్లం ఇచ్చింది.

మాట్లాడలేదు. ముఖంలోకి చూడలేదు.

చూస్తాడని ఆశించింది. ఆశగా చూచింది. పోతున్న సుందరరావును చూచింది. తిరుగుతున్న గడియారం ముళ్ళు చూచింది.

ఆ తర్వాత రోజూ వచ్చాడు. పావలా ఇచ్చాడు.

కుసుమ పూలు పొట్లం కట్టింది.

ఇవ్వలేదు.

ముఖంలోకి చూచింది.

తలవంచుకొని చేయి చాపి నిలబడ్డాడు.

పొట్లం చేతిలో పెట్టింది. తన చేయి తీయలేదు.

పట్టుకొన్నాడు. చేతిలోకి రాలేదు.

ఆమె వదల్లేదు. అతను అందుకోలేదు.

రెండు గట్లు మీద ఆనివున్న వంతెనలాగా ఇద్దరి చేతుల్లో పూలపొట్లం.

సుందరరావు ఆమె ముఖంలోకి చూడలేదు. పొట్లం వదల్లేదు. పోనీ లాక్కో లేదు. మరి మాట్లాడలేదు.

ఆమె నిరాశగా చూచింది. నెమ్మదిగా మౌనంగా గొంతులో నీటి చుక్క జారినట్లు వదిలేసింది.

సుందరరావు నిలబడకుండా వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

అతను మొన్న తన ముఖంలోకి చూడటం ఏదో పొరపాటువల్ల జరిగిన చేష్ట! పొరపాటున తీసిన కిటికిలోంచి వెలుగు జాడలా వెలుపలికి వచ్చిన చూపు! మేరమీరని సముద్రం ఒడ్డు మీదికి తాత్కాలికంగా ఎగిరి పడ్డ అల! వినయం కోసం అనాలోచితంగా మెరిసిన మెరుపు మహాకవి పద్యంలో గణభంగంగా అనవసరంగా పడ్డ పదం.

ఆపైన రెండురోజులు చూచింతర్వాత సుందరరావు కళ్ళలోంచి ఆ చూపును మళ్ళీ చూడలేనని నిశ్చయించుకొంది కుసుమ.

రోజులు గడుస్తున్నాయి.

తోటలోంచి పూలు వస్తున్నాయి.

తన అంగడిలో దండలవుతున్నాయి. చెండులవుతున్నాయి. మాలలవుతున్నాయి.

ఊరంతా వాసన వెదజల్లుతున్నాయి. విరజిమ్ముతున్నాయి. ఎన్ని తీగలో! ఎన్ని పూవులో! ఎన్ని మొగ్గలో!

మొగ్గలు, పూవులు నలగిపోయి, తొలగిపోయి, మళ్ళీ మొగ్గలు. మళ్ళీ పువ్వులు.

ఈ తీగలు సాగుతున్నాయి. ఈ మొగ్గలు తొడుగుతున్నాయి. ఈ పూవులు నలుగుతున్నాయి.

తీగలు మొగ్గలు, మొగ్గలు పువ్వులు పువ్వులు. నలిగితే సాఫల్యం.

రెణ్ణెల్ల తర్వాత ఒకరోజు వచ్చిన సుందరరావు పావలా ఇవ్వలేదు. రూపాయి ఇచ్చాడు.

కుసుమ పావలా పూల పొట్లం కట్టి ఇచ్చింది.

'కాదు'

అతని గొంతు అంత మధురంగా ఉండటం ఆమెకు తెలియదు.

ముఖంలోకి చూచింది.

'రూపాయివి!'

ఆమె గుండె పులకరించిది. శరీరం ఉప్పొంగి పోయింది. ఆనందం పట్టలేక పోయింది.

'రూపాయివా!'

'ఆ'

'అన్ని పూలతో'

'ఆ'

'చెండా? పూలా?'

'చెండు'

ఇంతకాలం పావలా పూలు తీసుకుపోయే సుందరరావు ఆరోజు రూపాయి పూవులు తీసుకు పోతుంటే కుసుమ ఆనందం పట్టలేకపోయింది. ఆగలేకపోయింది. చూడలేకపోయింది. అడక్కుండా ఉండలేక పోయింది.

'మీకేనా ?'

సుందరరావు మాట్లాడలేదు.

'మీకేనా'

జవాబులేదు.

అతను బొమ్మయి పోయాడు. కదల్లేదు. మెదల్లేదు.

పొంగిన అల సముద్రంలోకే కృంగిపోయినట్లు కుసుమ చప్పబడిపోయింది. లేచిన జ్వాల పొయిలోకి కూరుకు పోయినట్లు కుసుమ కూర్చుండి పోయింది. ఆరిన దీపం లాగా నిరాశా ఆవిరులు పొగలు వెళ్ళగక్కింది.

రూపాయి పూలచెండు పొట్లం గట్టింది. వెన్నముద్ద మజ్జిగలోంచి ఎత్తినట్లు ఎత్తింది. ఒద్దికగా అతని చేతుల్లో ఉంచింది. పూవు నుదుట బొట్టు పెట్టినట్లు రూపాయి దానిమీద ఉంచింది.

సుందరరావు తల ఎత్తలేదు. వెనుతిరిగి చూడలేదు.

'రేపు రూపాయివా, పావలావా పూలు' అనుకొంది.

సుందరరావు రేపు అనబడే రోజు రాలేదు. చాలా రేపులు కనబడలేదు. నెల అయినా సుందరరావు జాడలేదు.

అందుకు కారణం ఎంతో ఆలోచించింది. ఎంతో ఊహించింది. అర్థంకాక పూరుకొంది.

రెణ్ణెల్ల దాకా సుందరరావు కనబళ్ళేదు. ఆ రోజు ఎనిమిది గంటలకు ఆఫీసునుంచి ఇంటికి పోతున్నాడు. అంగడి మూద్దామనుకొంటున్న కుసుమ అతన్ని చూచి విలవిలలాడి పోయింది.

గడ్డం పెరిగింది. బట్టలు నలిగాయి. బూటులేదు.

చెప్పులు అరిగిపోయాయి.

ఆరిన దీపంలోంచి వచ్చే వికారపు పొగలాగా విచ్చలవిడిగా నడుస్తున్నాడు.

కుసుమ లేచి రోడ్డు కడ్డంగా పరుగెత్తింది.

'మీరు?' అంది.

'నేను'

ఈ గొంతు ఆ గొంతు కాదు.

ముఖంలోకి చూచింది.

వినయంగా చూశాడు.

ఈ చూపు ఆ చూపు కాదు.

మనిషిని నిలువెల్లా చూసింది.

తలవంచుకొన్నాడు.

కుసుమ కళ్ళనిండా నీళ్ళు నిండాయి. బావురుమని ఏడవాలనిపించింది.

'మీకేమయింది?' అంది.

జవాబు లేదు.

రోడ్డు రద్దీగా వుంది. 'రండి' అంది. చేయిపట్టుకొంది. ముఖంలోకి, కళ్ళలోకి, మెదడులోకి తిన్నగా చూశాడు. ఆమె ముఖం దించుకొంది. చేయి వదల్లేదు.

'ఏమయింది?'

అంగడి దగ్గరకు వచ్చారు. అతనేమీ మాట్లడలేదు.

రూపాయి పూలు పొట్లం కట్టింది. చేతిలో పెట్టింది.

అతను నవ్వాడు.

అది నవ్వు కాదు! శబ్దం. ఏడుపుకాదు! ఏదోధ్వని!

పూల పొట్లం నెమ్మదిగా జారవిడిచాడు.

'ఏం?'

'అవసరం లేదు' అన్నాడు.

మాట్లాడాడో ఏడ్చాడో ఏమీ తెలియలేదు.

'ఎందుకవసరం లేదు?'

'ఆమె చనిపోయింది'

కుసుమ తల తిరిగిపోయింది. భూమి క్రుంగిపోతున్నట్లనిపించింది.

'ఆ రోజు రెణ్ణెల్లక్రితం రూపాయి పూలు' తీసుకుపోయేసరికి చనిపోయి, మాట్లాడకుండా ఆగిపోయాడు.

కుసుమ కూలిన కోటగోడలాగా కుప్పగా పడిపోయింది.

ఆపైన వారం రోజులైనా సుందరరావు కనబడలేదు.

అప్పుడప్పుడు రోడ్డున పోతూ వస్తూ ఆమె అంగడివైపు చూచేవాడు.

అది చూపు కాదు.

యథాలాపంగా ఎప్పుడైనా 'బాగున్నావా?' అనేవాడు.

అది మాటకాదు.

పిచ్చివాలకం! పాతికేళ్ళకే వృద్ధాప్యం.

కాళ్ళీడ్చుకొంటూ వెళ్ళేవాడు. బాగా పొద్దుపోయిందాకా ఆఫీసులో ఉండేవాడు. రాత్రి తొమ్మిదికి పోతుంటే ఒక రోజు చూచింది. పలకరించింది.

'మీ ఆరోగ్యం ఎలా వుంది?'

'ఇలా.'

నిద్ర కళ్ళతో బదులు చెప్పాడు.

ఒక రోజు ఆరు గంటలకే ఆఫీసు వదిలిపోతున్నాడు.

ఆమె పేగుల్లో ఎక్కడో నవ్వు తొలకరి చినుకులాగా జారింది. మళ్ళీ నాలుగు రోజులకు కనిపించాడు. గడ్డం గీసుకొన్నాడు. ఇస్త్రీబట్టలు వేసుకొన్నాడు. సినిమాకి పోతున్నాడు. మునుపటి మనిషి అయ్యాడు.

తుంచని మల్లెమొగ్గ పువ్వు చెట్టుమీద వాడిపోయి రాలి పడిపోయినట్లు ఒక కన్నీటిబొట్టు కన్ను అంతా లేగదూడలాగా ఉరుకులు పరుగులతో కలియ తిరిగి చూపును మసక చేసింది.

వస్తూ పోతూవున్నా సుందరరావు కంటి ఎదుట కనబడుతూ ఉన్నప్పటికీ అతనెవరో, తనెవ్వరో, ఏమీ సంబంధం లేదు.

ఉన్న సంబంధం పూలు.

అవి ఇప్పుడతనికి అవసరం లేదు.

పూలు తనకెప్పటికి లేవు.

పూలు లోకం కోసం తనదగ్గర వున్నాయి.

అతనికోసం కాదు.

ఆ రోజు జీతం వచ్చింది. పర్సు బరువుగా వుంది.

నెమ్మదిగా, బలంగా, గట్టిగా, విశ్వాసంతో వచ్చిన సుందరరావు కుసుమ ముందు, అంగడి ముందు, రోడ్డుమీద, గడియారం స్తంభం నీడలో, నిలబడ్డాడు.

చేతులు మెడ, నుదురు, తల మార్చి మార్చి కుసుమను చూస్తున్నాడు.

'ఏం?' అంది.

బదుల్లేదు.

సుందరరావు చూస్తున్నాడు.

ఆ చూపు ఎక్కడో ఎప్పుడో చూచినట్టు గుర్తు.

రోడ్డుమీద రద్దీ! గడియారం కదలిక ! మల్లెపూల సువాసన! ప్రాచీన సువాసన! శతాబ్దాల సువాసన!

పర్సు తీసి పూల పక్కనే పెట్టాడు.

'ఏం?' అంది.

'పూలు' అన్నాడు.

ఎంతకి?

'పర్సుకు.'

ఆమె గుండె ఆగినంత పని అయింది.

'ఏంది?' అంది.

'పూలు!' అన్నాడు.

ఒక్కసారి పూలకు ప్రాణం వచ్చి సుగంధం విడుస్తున్నట్టు సువాసన. ఆమె పూలు ఇవ్వలేదు.

సుందరావు దగ్గరకు వెళ్ళాడు. రెండు చేతులు పట్టుకొన్నాడు. వారించ లేదు. నిలబెట్టాడు. కాదనలేదు.

దోసెడు పూలచెండు తీసుకొన్నాడు. కుసుమ తూలిపోతూ వుంది. తల నిండా తురిమాడు. కళ్ళనిండా నీళ్ళు!

మల్లెమొగ్గ ఎక్కడో పుట్టింది. ఎక్కడో పెరిగింది. ఎవరో తుంచారు. ఎవరో తెచ్చారు. ఈ మాలలో నిలిచింది. ఈతలలో వెలసింది.